# తల్లిదండ్రులు ఆదర్శప్రాయులైనప్పుడే పిల్లలు గుణవంతులౌతారు

గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి
    సావిత్రి భారత సతియె కాదె
తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె
    చంద్రమతి పవిత్ర పడతి కాదె
కులసతీత్వమునకై గుండాన దూకిన
    సీత భారత ధరాజాత గాదె
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
    దమయంతి భారత రమణి గాదె

సత్యసాగర పరివేష్టితోర్వితలము
భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపద కిది మహా పంటభూమి
అఖిల దేశాల కిది ఉపాధ్యాయి కాదె!

ప్రేమస్వరూపులారా! అనాది కాలము నుండి భారతదేశంలో స్త్రీలు ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ దేశానికి ఆనందాన్ని అందిస్తూ వచ్చారు. స్త్రీ అనగా ప్రకృతి స్వరూపిణి. మన ప్రాచీన ఋషులు ప్రకృతిని ఆధారం చేసికొనియే జీవిత సమస్యలను పరిహారం గావించుకుంటూ వచ్చారు. ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా దుఃఖము, అశాంతి గోచరిస్తున్నవి. దీనికి కారణం పవిత్ర హృదయులైన స్త్రీపురుషులు లేకపోవటమే. దేశముయొక్క మంచి చెడ్డలు స్త్రీపురుషుల ప్రవర్తనపైననే ఆధారపడియున్నవి. పవిత్ర హృదయులైన స్త్రీపురుషులున్నప్పుడే దేశం సుభిక్షంగా,

srisathyasaivachanamrutam

**సుక్షేమంగా ఉంటుంది. న్యూస్‌పేపర్‌కు స్వతః ఎట్టి వాసనా ఉండదు. దానిలో మల్లెపూలను పెట్టి చుట్టినప్పుడు ఆ పేపరు మల్లెపూల వాసన వెదజల్లుతుంది; పకోడాలను పెట్టి చుట్టినప్పుడు పకోడాల వాసన వస్తుంది; చేపలను పెట్టి చుట్టినప్పుడు చేపల వాసన వస్తుంది. మానవుని హృదయం ఒక పరిశుద్ధమైన కాగితంవంటిది. తాను పవిత్రమైన భావములను పోషించుకున్నప్పుడే హృదయం పవిత్రమైన కరుణచేత విరాజిల్లుతుంది. కాని ఈనాడు మానవుని హృదయం దుర్భావములచేత, దుశ్చింతలచేత కలుషితమైపోతున్నది.**

ప్రాచీన కాలమునుండి భారతీయ స్త్రీలు తమ హృదయపవిత్రతచేత అనేక ఘనకార్యములు సాధిస్తూవచ్చారు. "గత జీవుడగు పతిన్ బ్రతికించు కొన్నట్టి సావిత్రి భారత సతియె కాదె!" చరిత్రలో మరణించిన భర్తను బ్రతికించుకొన్న స్త్రీలున్నారుగాని, మరణించిన భార్యను బ్రతికించుకొన్నటువంటి పురుషుడు కానరాడు. గుణవంతులైన భారతీయ స్త్రీలు అనాది కాలమునుండి ఎన్నో ఆదర్శాలను అందిస్తూవచ్చారు. ఈనాడు సమాజం స్త్రీల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టటం లేదు. సద్భావములకు, సత్కర్మలకు సమాజంలో అవకాశమే కనిపించటం లేదు.

కనుకనే స్త్రీలలో పవిత్రమైన భావములను అభివృద్ధిపరచగోరి సత్యసాయిసంస్థలలో మహిళావిభాగమును ఏర్పాటు చేయటం జరిగింది. స్త్రీలు పవిత్ర హృదయులైనప్పుడే జగత్తు పవిత్రమైనదిగా రూపొందుతుంది. స్త్రీలు మహాశక్తిసంపన్నులు. వారు తల్చుకుంటే ప్రపంచాన్నే ఒక మూటమాదిరి కట్టగలరు. కాని పురుషులు స్త్రీలయొక్క శక్తిసామర్థ్యాలను గుర్తించలేక వారిని బానిసలమాదిరి చూస్తున్నారు; తమ స్వార్థ స్వప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారేగాని, స్త్రీలవల్ల జగత్తుకు జరిగే ఉపకారాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. కనుకనే దేశం దురవస్థలపాలౌతున్నది. సమాజం స్త్రీలయొక్క శక్తిసామర్థ్యాలను గుర్తించి వారికి తగిన ఉత్సాహ ప్రోత్సాహాల నందించి తోడ్పడాలి.

**తల్లిదండ్రులే పిల్లలను పెడమార్గం పట్టిస్తున్నారు**

స్త్రీల హృదయం స్వార్థరహితమైనది; దయ, ప్రేమలచేత నిండి ఉంటుంది. పిల్లలను

పోషించే విషయంలో వారు ఎంతో జాగ్రత్త వహిస్తారు. వారిని ఆదర్శవంతులుగా తీర్చిదిద్దటానికి ఎంతో పాటుపడుతుంటారు. కాని ఆధునిక విద్యావిధానంవల్ల పిల్లల మనస్సు క్రమక్రమేణ మాలిన్యమైపోతున్నది. పూర్వం తల్లులు తమ పిల్లలు అక్షరాభ్యాసం చేసేటప్పుడు వారికి "ఓం నమః శివాయ, ఓం నమో నారాయణాయ" అనే పవిత్రమైన మంత్రములను నేర్పించేవారు. అందుచేత ఆ పిల్లల హృదయాలలో పవిత్రమైన భగవన్నామం చిరస్థాయిగా నిలిచిపోయేది. కాని, ఈ ఆధునిక చదువులు ఏరీతిగా ఉన్నాయి? పిల్లలకు మొట్టమొదట "బా.. బా.. బ్లాక్‌షీప్" ఇలాంటివి నేర్పిస్తున్నారు.

పూర్వకాలంలో పిల్లలు పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు వారిని పూజాగదిలోనికి తీసుకువెళ్ళి టీచర్లు బోధించిన విషయాలను వారిచేత తిరిగి చదివించేవారు. కాని ఈనాటి తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విషయాలను బోధించటం లేదు. తల్లిదండ్రులే పిల్లలను పెడమార్గం పట్టిస్తున్నారు. కొడుకు కాలేజీనుండి ఇంటికి వచ్చిన తక్షణమే అమ్మ టీవీ 'ఆన్' చేస్తుంది. తండ్రీకొడుకులు టీవీ చూస్తూ కూర్చుంటారు. తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించవలసినవేనా ఇవి? పూర్వం తల్లిదండ్రులు తమ పిల్లలు మంచివారు కావాలని ఆశించేవారు. కాని నేటి తల్లిదండ్రులు తమ పిల్లలు గొప్పవారు కావాలని ఆశిస్తున్నారేగాని, మంచివారు కావాలని కోరుకోవటం లేదు. "ఒరేయ్! నీవు గొప్ప చదువు చదవాలి, డబుల్ డిగ్రీ పొందాలి. అప్పుడు నీకు లక్షాధికారియైన మామ చిక్కుతాడు" అని చెబుతారు. పూర్వకాలంలో పిల్లలకు గుణవంతురాలైన భార్య కావాలని కోరుకునేవారేగాని, ధనవంతుడైన మామగారు కావాలని ఆశించేవారు కాదు. ఆ రోజుల్లో పిల్లలు తమ ఇంటికి వచ్చిన పెద్దలకు నమస్కరించి స్వాగతం పలికేవారు. ఈనాటి పిల్లల్లో అట్టి వినయవిధేయతలు శూన్యమైనాయి. వీళ్ళు కేవలం కలిమిని, చెలిమిని, బలిమిని కోరుతున్నారేగాని, గుణమును కోరటం లేదు. గుణమే లేకపోతే కలిమి, చెలిమి, బలిమి ఎంత ఉన్నా ఏమి ప్రయోజనం? మొట్టమొదట పిల్లల్లో గుణమును పెంపొందించాలి. ఈనాడు ప్రపంచం ఇన్ని అవస్థలకు గురి కావటానికి కారణమేమిటి? గుణవంతులైన పిల్లలు తయారుకావటం లేదు. గృహమే పిల్లలకు ప్రధానమైన పాఠశాల. రెండవది సమాజము.

sri sathyasai vachanamrutam

## పేరు నిలబెట్టేవాడే నిజమైన పుత్రుడు

ఈనాడు ప్రతి విద్యార్థి గుర్తించవలసిన విషయమొకటుంది. “నేను సమాజంనుండి అనేక విద్యలు నేర్చుకున్నాను, ఎంతో అభివృద్ధిని సాధించాను. అందుకు ప్రతిఫలంగా నేను సమాజానికి ఏమిస్తున్నాను?” అని తనను తాను ప్రశ్నించుకోవాలి. సమాజంనుండి ఉపకారం పొంది సమాజానికి అపకారం తలపెట్టేవాడు కృతఘ్నుడు. మీరు ఎవరినుండి మంచిని నేర్చుకున్నారో వారిపట్ల జీవితాంతం కృతజ్ఞులై ఉండాలి. అప్పుడే మీరు చదివిన చదువు సార్థకమౌతుంది. మీరు సమాజంలో పుట్టారు, సమాజంలో పెరిగారు, సమాజంలో జీవిస్తున్నారు.

కనుక సమాజాన్ని గౌరవించాలి. సమాజంపట్ల కృతజ్ఞత చూపాలి. అభిమన్యునివలె మీరు మీ వంశమునకు సత్కీర్తి తేవాలి. అతడు యుద్ధానికి బయల్దేరుతుంటే తల్లియైన సుభద్ర “నాయనా! నీ తండ్రిగారైన అర్జునుడు, మామగారైన కృష్ణుడు ఇంటివద్ద లేరు. నీ భార్య గర్భవతి. ఇలాంటి పరిస్థితిలో నీవు యుద్ధానికి వెళ్ళటం మంచిది కాదు” అని ఎంతగానో నచ్చజెప్పింది. కాని అభిమన్యుడు ఏమన్నాడు?

వెఱవక కుంభిజాతి కురువీరులపై మృగరాజువోలె నే<br>
నఱుకుచునుం డఖండ నికరోన్నత దివ్య మహాస్త్రపంక్తినిం<br>
బఱపుచు గెల్చి రమ్ము! సుత! భద్రము నీకగునంచు పల్క కీ<br>
తెఱగున పోకుపోకుమని తీవ్రత నాపుట నీకు పాడియా!

“తల్లీ! యుద్ధంలో శత్రువులను చీల్చిచెండాడి విజయం సాధించి రమ్మని నన్ను ఆశీర్వదించవలసిందిపోయి ఈరీతిగా పోవద్దని నాకు అడ్డు చెప్పటం న్యాయం కాదు” అన్నాడు. అప్పుడు సుభద్ర తల్లిగా కర్తవ్యాన్ని గుర్తించి “నాయనా! కుమారుడవై పుట్టినందుకు కుటుంబ గౌరవాన్ని పోషించటం, వంశముయొక్క కీర్తిని నిలబెట్టటమే నీకు ముఖ్యం” అని పలికి అతనిని ఆశీర్వదించి పంపింది. ఈ ఆధునికయుగంలో బిడ్డలకు ఈరీతిగా సద్బోధలు చేసే తల్లులున్నారా? ఈనాటి తల్లిదండ్రులు కొడుకు పుట్టిన తక్షణమే బంధుమిత్రులకు స్వీట్లు పంచుతారు. కాని

sri sathyasai vachanamrutam

పూర్వం తల్లిదండ్రులు అలా చేసేవారు కాదు; తమ కుమారుడు సమాజంలో మంచిపేరు తెచ్చుకున్న రోజే అతని పుట్టిన పండుగ జరుపుకునేవారు.

**పుత్రోత్సాహము తండ్రికి**
**పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా**
**పుత్రుని కనుగొని పొగడగ**
**పుత్రోత్సాహంబు నాడు పొందును....**

"మీ కుమారుడు చాలా గొప్పవాడండి, చాలా మంచివాడండి" అని ఏనాడు జనులు కీర్తిస్తారో ఆనాడే తండ్రికి పుత్రోత్సాహం కల్గుతుంది.

వేదము "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" అని బోధించింది; తల్లికే ప్రథమస్థానము నందించింది. పవిత్రమైన మన ప్రాచీన చరిత్రలో కూడా ఈవిషయాన్ని మీరు గమనించవచ్చు. సీతారాములంటారే గాని, రామసీత అని ఎవరైనా అంటారా? రాధాకృష్ణులంటారేగాని, కృష్ణరాధ అని ఎవ్వరూ అనరు; పార్వతీపరమేశ్వరులంటారేగాని, పరమేశ్వరపార్వతు లనరు. కారణమేమిటి? పిల్లలను ప్రేమతో కాపాడి, వారిని అభివృద్ధికి తెచ్చి, వారి జీవితాన్ని ఉద్ధరించేది తల్లియే. "మధురభావంబేది మన దేశమందన్న మాతృభావము కన్న మాన్యమెద్ది?" మాతృభావముకంటే మధురమైనది మరొకటి లేదు. పిల్లలు మాతృమూర్తి మనస్సును సంతృప్తిపరచాలి. పవిత్రమైన మాతృమూర్తులు అభివృద్ధి కావాలి. ఇట్టి అభివృద్ధిని కోరే ఈ నవంబరు 19న మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము.

**ఆదర్శమాత ఈశ్వరమ్మ**

ఈ శరీరమునకు మాతృమూర్తి అయిన ఈశ్వరమ్మ ఎన్నో మంచి విషయాలను చెప్పేది. ఆమెకు చదువుసంధ్యలు రావు, అసలు ఓనమాలే నేర్చుకోలేదు.కాని,ఆమె హృదయం విశాలమైనది. ఆమెయే నన్ను మొట్టమొదట పుట్టపర్తిలో ఒక స్కూలు కట్టించమని కోరింది. "స్వామీ! చిన్నచిన్న పిల్లలు చదువుకోసం బుక్కపట్టణానికి నడచి వెళ్ళటం చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. కనుక మన గ్రామంలోనే ఒక చిన్న స్కూలు కట్టించండి" అని కోరింది. "నాదగ్గర డబ్బు లేదే!" అన్నాను. వెంటనే తన మెడలోని హారం తీసింది. "దీనిని అమ్మేసి ఆ

sri sathyasai vachanamrutam

డబ్బుతో స్కూలు కట్టించండి స్వామి!" అన్నది. "తొందరపడవద్దు. నిన్ను పరీక్షించటానికి అలా అన్నాను. నీ కోరిక ప్రకారం తప్పకుండా స్కూలు కట్టిస్తాను" అని చెప్పాను. రెండవ దినమే పునాది వేశాను. అతి స్వల్ప వ్యవధిలో ఇక్కడొక స్కూలు తయారైంది. పిల్లలందరినీ ఆ స్కూలులో చేర్చాను. ఈశ్వరమ్మను "ఇప్పుడు నీకు తృప్తిగా ఉందా?" అని అడిగాను. "కొంచెం తృప్తి అయిందిగాని, ఇంకొక కోరిక ఉన్నది స్వామి!" అంది. "ఏమిటది?" అని అడిగాను.

"స్వామి! మన గ్రామంలో పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వచ్చినప్పుడు ఆ తల్లులు వాళ్ళను ఎత్తుకొని బుక్కపట్టణానికి వెళ్ళవలసివస్తోంది. బుక్కపట్టణం చేరుకునే లోపల ఆ పిల్లలకు ఏమైపోతుందో అని భయంగా ఉంది. కాబట్టి ఇక్కడొక చిన్న ఆసుపత్రి కట్టించండి" అని కోరింది. వెంటనే ఒక చిన్న ఆసుపత్రిని కట్టించాను. ఈవిధంగా ఈశ్వరమ్మ అందరూ సుఖంగా, సంతోషంగా ఉండాలని ఆశించేది. "స్వామి! ఈ సౌకర్యాలు మన గ్రామంలో మాత్రమే ఉంటే సరిపోదు. అన్ని గ్రామాలవారికి ఈ సౌకర్యాలను కల్పించాలి; లోకంలో అందరికీ సుఖాన్ని అందించాలి" అని అంటూ ఉండేది. కేవలం తన పిల్లలు, తనవారు మాత్రమే కాదు, అందరూ సుఖంగా ఉండాలని ఆశించేది. ఇలాంటి ఆదర్శవంతులైన తల్లులవల్లనే భారతదేశం అనాది కాలమునుండి ఎంతో కీర్తిని పొందింది.

ఒక పర్యాయం సమ్మర్ కోర్సుకోసం నేను ఈశ్వరమ్మను బృందావనానికి తీసుకువెళ్ళాను. అప్పుడు మా కాలేజి పిల్లలను మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలనుండి విద్యార్థులను పిలిపించాను. విదేశీయులను కూడా పిలిపించాను. వారందరికీ మంచి బోధలు చేస్తుంటే ఈశ్వరమ్మ ఎంతో ఆనందించేది. "ఇప్పుడు నీకు ఆనందంగా ఉన్నదా?" అని అడిగితే "ఇంతమంది విద్యార్థులు బాగుపడుతుంటే, ఇంతకంటే ఆనందం ఏమి కావాలి స్వామి!" అనేది. ఒకనాడు ఉదయం పిల్లలందరూ టిఫిన్ చేయటం పూర్తి అయింది. ఈశ్వరమ్మ కూడా కొంచెం టిఫిన్ తిని కూర్చుంది. ఆ సమయంలో నేను పైనున్నాను. ఉన్నట్లుండి "స్వామి! స్వామి! స్వామి!" అని మూడుతూర్లు పిలిచింది. పైనుండి నేను "వస్తున్నాను, వస్తున్నాను, పోవద్దు" అన్నాను. గోకాక్ అక్కడే ఉన్నాడు. "ఏమిటి, స్వామి ఇట్లా చెబుతున్నాడే" అని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. నేను వెంటనే క్రిందికి వచ్చాను.

srisathyasaivachanamrutam

ఆమె నా చేతులు పట్టుకొని "స్వామీ! నా మనస్సుకి తృప్తి కల్గించారు. ఈ సమ్మర్ కోర్సువల్ల బాగుపడింది పిల్లలు మాత్రమే కాదు, నాకు కూడా విశాలమైన భావాలు కలిగియి. ఇక, నేను పోతున్నాను" అని నమస్కారం చేసింది. ఆమెకు అనాయాస మరణం ప్రాప్తించింది. కారణం? ఆమెలో ఏమాత్రం దుర్భావములు లేవు, నిరంతరము ఆనందంగా ఉండేది. అంత వయస్సులోనూ కల్యాణపురంలోని గోగినేనివారి ఇంటికి మూడు మైళ్ళు నడుచుకుంటూ వెళ్ళేది. "ఎందుకంత దూరం నడుస్తావు? కారులో పోవచ్చు కదా!" అని నేనంటే "స్వామీ! కారులో కూర్చుంటే నాకు సుఖం లేదు. నాకు కాళ్ళున్నాయి కదా! నా కాళ్ళపై నేను ఆధారపడాలి" అనేది.

ఒకనాడు నేను సుబ్బమ్మతో "సుబ్బమ్మా! నాకు పొడవైన గౌను కుట్టించు" అని చెప్పాను. అప్పుడీ దేహానికి పన్నెండవ సంవత్సరం జరుగుతోంది. సుబ్బమ్మ "స్వామీ! మీకు కావాలంటే పంచె కట్టుకోండి. గౌను ఎందుకు వేసు కుంటారు?" అన్నది. "లేదు, లేదు. సమయం వచ్చింది కాబట్టి అడుగుతున్నాను" అని అన్నాను. సరే, స్వామి మాటకు అడ్డు చెప్పకూడదని ఆమె ఒక గౌను కుట్టించి తెచ్చింది. ఆ రోజుల్లో ఒక గౌనుకు కావలసిన గుడ్డ ఖరీదు రెండణాలు. కుట్టినవానికి ఒక బొట్టు ఇవ్వాలి. మొత్తం రెండణాల బొట్టుతో నా గౌను తయారైంది. నేను అది వేసుకున్న  తక్షణమే ఆమె ఈశ్వరమ్మను పిలిపించింది. ఆమె వచ్చి నన్ను ఆ దుస్తులలో చూసి కంట నీరు పెట్టింది. "ఏమి స్వామీ! ఈ రూపాన్ని చూడటానికా నన్నిక్కడికి పిలిపించారు? చాలు, చాలు" అన్నది. "ప్రజల బుద్ధులలోని కషాయాన్ని తొలగించటానికీ నేనీ కాషాయవస్త్రం ధరించాను" అని నచ్చజెప్పి వారిద్దరినీ సమాధానపరచాను.

## దైవప్రేమకోసం పాటుపడేవారు అదృష్టవంతులు

ఇప్పుడు నా ప్రసంగాన్ని 'ట్రాన్స్‌లేట్' (అనువాదం) చేస్తున్న జయమ్మయే ఈశ్వరమ్మను చూసుకొనేది. పూర్వం వీరి ఇంటియందే ఆమె ఉండేది. ఆమెకు సేవ చేయటమేగాక భోజనం ఏర్పాట్లను కూడా జయమ్మయే చూసుకొనేది. ఆ సమయంలో ఆమెను అడిగి జయమ్మ అనేక విషయాలు తెలుసుకొనేది. జయమ్మకు వివాహమంటే ఇష్టం లేదు. కాని, ఆమె తల్లిదండ్రులు బలవంతం చేశారు. సరే, వివాహం నిశ్చయమైంది.  అప్పుడు నేను పుట్టపర్తిలో ఉన్నాను.

sri sathyasai vahini / vachanamrutam

"Today I am going to hell" (ఈ రోజు నేను నరకంలో ప్రవేశిస్తున్నాను) అంటూ జయమ్మ నాకు టెలిగ్రామ్ పంపించింది. అప్పుడు పుట్టపర్తికి పోస్టు వచ్చేది కాదు, పెనుకొండనుండి తీసుకొని వచ్చేవారు. నేను ఎంత చెప్పినా ఆమె తల్లిదండ్రులు నా మాట వినలేదు. అయితే తండ్రి గొప్ప గుణవంతుడే. ఆమె తల్లికూడా చాలా గొప్పది. నా పాదాలకు నమస్కారం చేసుకుంటూ "ఈశ్వరమ్మ గుణాలు నాకు రావాలి స్వామి!" అని ప్రార్థించేది.

సరే, జయమ్మ పెండ్లి అయిపోయింది. నేను అక్కడకు పోలేదు. ఆమె భర్త చాలా మంచివాడు, అమెరికాలో చదువుకున్నాడు, గొప్ప విద్యావంతుడు, రాజమండ్రిలో ఆఫీసరుగా పనిచేసేవాడు. నేను రాజమండ్రికి వెళ్ళినప్పుడు నాకు చాలా సేవ చేశాడు. నేనెక్కడికి వెళ్ళాలన్నా కారును సిద్ధంగా ఉంచేవాడు. ఆయన పేరు గోపీనాథ్. "స్వామి! నన్ను, జయమ్మను నిరంతరం తమ పాదాలదగ్గర పెట్టుకోండి" అని ప్రార్థించేవాడు. తొందరపడవద్దని నేను చెబుతూవచ్చాను.

నేను రాజమండ్రినుండి తిరిగి వచ్చిన తరువాత గోపీనాథ్ మరణించాడని టెలిగ్రామ్ వచ్చింది. జయమ్మ ఇంటితలుపులు వేసి తక్షణమే బయల్దేరివచ్చింది. బృందావనంలో చెట్టు క్రింద విభూతి పెట్టుకొని కూర్చుంది. "ఎందుకీ వేషం వేశావు?" అని అడిగాను. "నేను వేసుకున్నది కాదు, మీరే వేశారు. ఆయన ఉంటే నేను విభూతి ఎందుకు పెట్టుకుంటాను? లేడు కనుకనే విభూతి పెట్టాను. ఇంక నేనెక్కడికీ వెళ్ళను" అంది. అప్పుడు కారుణ్యానందను, రామబ్రహ్మంను రాజమండ్రికి పోయి ఆమె వస్తువులను ప్యాక్ చేసి తీసుకురమ్మన్నాను. జయమ్మను అనంతపురం కాలేజిలో ఇంగ్లీషు బోధించమని చెప్పాను. ఆమె గొప్ప టీచరు. బ్రిటీషువారి కాలంలో ఆమెకు ఇంగ్లీషులో గోల్డ్‌మెడల్ వచ్చింది. తరువాత మహారాణి కాలేజిలో సంస్కృతం చదివింది. కాని ఆమెకు తృప్తి కల్గలేదు.

"స్వామి! నేను ప్రొఫెసర్ గోకాక్ దగ్గర డాక్టరేటు డిగ్రీ తీసుకోవాలి" అంది. నేను గోకాక్‌కు చెప్పాను. జయమ్మ పట్టుదలతో కృషి చేసి డాక్టరేట్ డిగ్రీ సాధించింది. ఆనాటి మొదలు ఈనాటివరకు ఎక్కడికీ పోలేదు, అనంతపురంలోనే ఉంటోంది. ప్రతి ఆదివారం ఇక్కడికి వచ్చేది. "జయమ్మా! ఈవిధంగా టైమ్ వేస్ట్ చేయకూడదు. 'డ్యూటీ ఈజ్ గాడ్'. నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు" అని చెప్పాను. ఆమె నా ఆజ్ఞను శిరసావహించి నడుచుకుంటోంది.

srisathyasaivachanamrutam

నేను పాత మందిరంలో ఉన్నప్పుడు ఈ జయమ్మ నాల్గు సంవత్సరాల బిడ్డ. నేను ఎక్కడికి వెళితే అక్కడికి చిన్న టవలు చేత్తో పట్టుకొని వచ్చేది. ఆవిధంగా చేయమని ఆమెకు తల్లిదండ్రులు చెప్పేవారు. స్వామి దగ్గరే పెరిగి పెద్దదైంది కనుకనే, ఆమెలో పవిత్రమైన భావాలు అభివృద్ధి అవుతూవచ్చాయి.

భగవంతుడు పరిపూర్ణమైన ప్రేమస్వరూపుడు, స్వార్థరహితుడు. అట్టి భగవంతుణ్ణి అనుసరించేవారు స్వార్థరహితులు కావాలి. మీ హృదయాలు ప్రేమతో నిండిపోవాలి. మీ హృదయంలో ప్రేమ నిండినప్పుడు ప్రపంచమంతా ఒక్కటవుతుంది; ఏకాత్మభావన ఏర్పడినప్పుడు ద్వేషానికి అవకాశమే ఉండదు. "నీవు, నేను ఒక్కటే" అనే సత్యాన్ని గుర్తించినప్పుడే ప్రేమతత్త్వం అభివృద్ధి అవుతుంది. దైవాన్ని అనుసరిస్తూ, దైవప్రేమకు పాటుపడే వ్యక్తులు ఎంతో అదృష్టవంతులు. నాలో కాలినుండి తలవరకు ఎక్కడా స్వార్థం లేదు. ఇలాంటి స్వార్థరహితప్రేమను అనుసరించి మీరు కూడా స్వార్థరహితులుకండి. లోకంలో తల్లిదండ్రుల ప్రేమ, బంధుమిత్రుల ప్రేమ అంతో, ఇంతో స్వార్థంతో కూడియుంటుంది. కాని భగవంతుని ప్రేమలో ఏమాత్రం స్వార్థముండదు. అలాంటి స్వార్థరహిత ప్రేమకోసం మీరెందుకు ప్రాకులాడరు? కేవలం భౌతికమైన, లౌకికమైన ప్రేమకోసం మీరు పాటుపడుతున్నారు. ఇవన్నీ నెగెటివ్ ప్రేమలు. దైవప్రేమ ఒక్కటే పాజిటివ్. అట్టి ప్రేమను మీరు పొందినప్పుడు ఎట్టి ఘనకార్యమునైనా సాధించగలరు. ఎవరేమనుకున్నా ఫరవాలేదు, మీలో పవిత్రమైన ప్రేమ ఉన్నప్పుడు మీరు ఎవ్వరికీ భయపడనక్కర్లేదు. వారి మాటలు, వీరి మాటలు నమ్మి దైవప్రేమను దూరం చేసుకోకండి. లోకులు కాకులు, వారేమైనా చెప్పవచ్చు. మీరు హృదయాన్ని ఆధారం చేసుకొని విచారణ చేయాలి.

**నాకు ఆనందము తప్ప అన్యము తెలియదు**

నా హృదయం పవిత్రమైనది. కాబట్టి నేను దేనికీ భయపడను. మనలో దోషమే లేనప్పుడు మనకు భయమెందుకు? నా హృదయం నిండుగా ఉన్నది ప్రేమయే. అందులో ఇంకొకటి ప్రవేశించటానికి అవకాశమే లేదు. అయితే ఓర్వలేనివారు, అసూయాపరులు అనేక కథలు పుట్టిస్తుంటారు. అవన్నీ మన మంచికోసమే. దూషణ, భూషణ, తిరస్కార, పురస్కారములన్నీ

srisathyasaivahini.org

మన మంచికోసమే అని భావించాలి. “నసుఖాత్ లభ్యతే సుఖం” సుఖమునుండి సుఖము లభించదు, కష్టము నుండియే సుఖము లభిస్తుంది; నిందలనుండియే పూజలు ప్రారంభమౌతాయి. దైవంయొక్క కీర్తి అభివృద్ధి కావాలంటే మధ్యలో నిందలు తప్పవు. వాటికి మనం ఏమాత్రం భయపడనక్కర్లేదు.

‘ఎస్’ అనువారికి ‘ఎస్’ అనురా
‘నో’ అనువారికి ‘నో’ అనురా
‘నో’, ‘ఎస్’లు మీ నోటికెగాని
సాయికి సర్వం ‘ఎస్, ఎస్, ఎస్’

నా నోటినుండి ‘నో’ అనేది రానే రాదు. నాకు ఎప్పుడూ ఆనందమే. నాకు ఆనందము తప్ప అన్యము తెలియదు. “స్వామీ! నా భర్త చనిపోయినాడు” అంటే “చాలా ఆనందము” అంటాను. “నా భర్త పోయినాడంటే స్వామి ఎందుకిలా చెబుతున్నారు? నా మాటలు వినిపించుకోలేదేమో” అనుకుంటారు. అన్నీ మంచికోసమే. పుట్టుక ఉన్న తరువాత చావు లేకుండా ఉంటుందా? ఈ రెండూ జంటపక్షులే. కనుక నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. నాకు ఏ వాంఛలూ లేవు. నాకున్నది ఒకే కోరిక - అందరూ ఏకం కావాలి. అందరూ ఆత్మతత్త్వాన్ని గుర్తించాలి, ప్రేమతత్త్వంలో జీవించాలి. మీరు తెలిసో తెలియకో కొన్ని తప్పులు చేసియుండవచ్చు. అయితే తెలిసిన తరువాత తప్పుపనులు చేయకూడదు. జరిగిందేదో జరిగిపోయింది. భవిష్యత్తు మీ చేతిలో లేదు. వర్తమానమే చాలా ప్రధానమైనది. కనుక వర్తమానంలో సక్రమమైన కర్మలనాచరిస్తూ ఆనందాన్ని అనుభవించండి. ఎక్కడికి పోయినా, ఏ పని చేసినా “పదిమందికి నేను ఉపకారం చేస్తున్నానా?” అని విచారణ చేయండి. స్వార్థాన్ని నిర్మూలించుకోండి.

పిల్లలు మంచివారుగా తయారు కావాలేగాని, గొప్పవారు కావాలని ఆశించనక్కర్లేదు. మొట్టమొదట ‘గుడ్ బాయ్స్’ గా తయారై కట్టకడపటికి ‘గాడ్ బాయ్స్’ గా రూపొందాలని నేను ఆశిస్తున్నాను. పూర్వం బ్రిటీషు వారున్నప్పుడు ‘గుడ్ బాయ్’ (Good boy) అనేది వాడుకలోకి వచ్చింది. తరువాత అది ‘గుడ్ బై’ (Good Bye) గా మారిపోయింది. ఇప్పుడు ‘గుడ్’ కూడా పోయి ‘బై’ (Bye) అంటున్నారు! ఈవిధంగా, కాలమార్పుచేత కొన్ని పదాలు కూడా

sri sathyasai vachanamrutam

మారిపోతూవచ్చాయి.

ప్రేమస్వరూపులారా! నవంబరు 19వ తేదీన మహిళా దినోత్సవం జరుపుకోవాలని ఏదో తమాషాకోసం నిర్ణయించింది కాదు. తల్లులయొక్క ప్రేమతత్త్వాన్ని జగత్తునకు చాటాలి. పిల్లలను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలి. అందునిమిత్తమై ఈ 19వ తేదీన మహిళా దినోత్సవమును జరుపు కుంటున్నాము. చాలామంది ప్రతి నెల 19వ తేదీన ఈ పండుగను జరుపు కుంటున్నారు. ఇది స్వామి దృఢసంకల్పంతో నిర్ణయించినది. ఎన్ని జన్మలైనా, ఎన్ని వేల సంవత్సరాలైనా ఇది మారదు.

**(19.11.2001 సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vacharamrutam